కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :189 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | బుధవారం 18-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

అభివృద్ధికి,రైతుల సంక్షేమానికి పెద్దపీట



సత్తుపల్లి, రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రూ. 10.80 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం చెల్లగుల్ల నరసింహారావు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, గత 45 సంవత్సరాలుగా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశానని తెలిపారు. రాజకీయంగా ఎన్ని మార్పులు వచ్చినా ప్రజలు, నాయకులు తనను ఆదరించి ముందుకు నడిపించారని గుర్తు చేసుకున్నారు. ఎన్టీ రామారావు హయాంలో ఆరు మండలాలతో కూడిన సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రజాసేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమని పేర్కొన్నారు.

గోదావరి జలాలతో సాగునీటి సమస్యకు పరిష్కారం

ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన దేవాదుల, దుమ్ముగూడెం ప్రాజెక్టులు వివిధ కారణాలతో నిలిచిపోయినప్పటికీ, అనంతరం సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకువచ్చామని మంత్రి వివరించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని పలు చెరువుల ద్వారా ఇప్పటికే ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. రాబోయే సంక్రాంతి నాటికి వేశ్యాకాంతల చెరువుకు కూడా గోదావరి జలాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీలో జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకుని, మే నెల నాటికి మరిన్ని ప్రాంతాలకు సాగునీరు అందించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

పామాయిల్ రైతులకు శాశ్వత ప్రయోజనాలు

కల్లూరుగూడెంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణంతో ఈ ప్రాంతంలో సుమారు 3 వేల ఎకరాల్లో పామాయిల్ సాగు జరుగుతోందని, మరో 3 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారని మంత్రి తెలిపారు. పామాయిల్ రైతులకు నష్టాలు కలగకుండా శాశ్వత ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పామాయిల్‌తో పాటు కోకో, మిరియాలు వంటి ఉద్యానవన పంటలను సాగు చేస్తూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సత్తుపల్లి ప్రాంతంలో రవాణా సౌకర్యాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విమానాశ్రయం, భద్రాద్రి రాముడి క్షేత్రానికి రైల్వే లైన్, సత్తుపల్లి మీదుగా కోవూరు, కొండపల్లికి రహదారి సౌకర్యాల మెరుగుదల తన లక్ష్యమని పేర్కొన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ తరహాలో సత్తుపల్లి మార్కెట్‌ను కూడా అన్ని సౌకర్యాలతో కూడిన మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, పార్టీ విజయానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పించడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. అందులో భాగంగానే సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చెల్లగుల్ల నరసింహారావుకు అవకాశం కల్పించామని తెలిపారు. నూతన పాలకవర్గం రాబోయే రెండేళ్లలో మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసి రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతే రాజు అనే నినాదంతో ఆరు గ్యారెంటీలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, వరి ధాన్యానికి బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్

ఒంటెద్దు పోకడ సరికాదు: 'ఇంటర్ బోర్డు రద్దు'పై కవిత కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,రాష్ట్రంలో ఇంటర్మీడియట్ బోర్డును ఒంటెత్తు పోకడలతో రద్దు చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడలో 'ఇంటర్ బోర్డు రద్దు – తెలంగాణ విద్యపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డ్రాప్ అవుట్స్ పేరుతో ఇంటర్ బోర్డును రద్దు చేయాలనుకోవడం సరికాదని, ఈ విషయంలో ముఖ్యమంత్రి చెబుతున్న గణాంకాలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని కవిత విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న విద్యా విధానంలో కీలక మార్పులు చేస్తున్నప్పుడు విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం కచ్చితంగా చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. 'ప్రభుత్వాన్ని ఏదైనా ప్రశ్నిస్తే ఎదురుదాడి చేసే పరిస్థితి నెలకొంది. అందుకే మేధావులు, విద్యావేత్తల అభిప్రాయాలను సమాజానికి తెలియజేసేందుకే మేమే ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశాం' అని ఆమె పేర్కొన్నారు. పరిపాలనా సంస్కరణలు, విద్యా సంస్కరణలు ప్రభుత్వం భ్రమపడకూడదని హితవు పలికారు.



డ్రాప్ అవుట్ లెక్కలపై కవిత కౌంటర్..

పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్‌లో చేరుతున్న వారిలో పది మందిలో ఆరుగురు మాత్రమే ఉంటున్నారని, డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉన్నాయన్న ఒకే కారణంతో బోర్డును రద్దు చేస్తామని సీఎం చెప్పడాన్ని కవిత తప్పుబట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల లెక్క అలా ఉండి ఉండొచ్చు కానీ, రాష్ట్రవ్యాప్తంగా ఓవరాల్‌గా చూస్తే డ్రాప్ అవుట్స్ కేవలం 16 శాతం మాత్రమే ఉన్నాయని ఆమె వివరించారు. ప్రభుత్వ బడుల్లో పదో తరగతి పూర్తి చేసిన వారు ప్రైవేట్ కాలేజీల్లోనో, ఇతర కోర్సుల్లోనో చేరుతున్నారని తెలిపారు. ఒకవేళ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉంటే అది ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు.

అమ్మాయిలు కాదు... అబ్బాయిలే ఎక్కువ..

పదో తరగతి నుంచి ఇంటర్‌కు వెళ్లేవారిలో బాలికలే ఎక్కువగా డ్రాప్ అవుట్ అవుతున్నారని సీఎం చెప్పడం అవాస్తవమని కవిత అన్నారు. 'ముఖ్యమంత్రి హోదాలో ఉండి అబద్ధాలు చెప్పవద్దు. ఇంటర్‌కు వెళ్తున్న బాలికల సంఖ్య 77.4 శాతంగా ఉంటే, బాలుర సంఖ్య 68.4 శాతం మాత్రమే ఉంది. అంటే అబ్బాయిలే ఎక్కువగా చదువుకు దూరమవుతున్నారు. అంతేకాదు, ఇంటర్‌లో ఫెయిల్ అవుతున్న వారిలో 51 శాతం అబ్బాయిలే ఉన్నారు. గంజాయి వంటి వ్యసనాలకు బానిసే కావడం, చదువుపై నిర్లక్ష్యం ఇందుకు కారణం. ప్రభుత్వం అబ్బాయిల విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి అని సూచించారు. పేదరికం గ్రామాల్లో సరైన బస్సు సౌకర్యం లేకపోవడం వంటి కారణాలతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఎక్కువగా చదువు మానేస్తున్నారని నీతి ఆయోగ్ నివేదికలు సైతం స్పష్టం చేశాయని కవిత గుర్తుచేశారు.

గుజరాత్ పారిశ్రామిక వేత్తలకు శ్రీధర్‌బాబు ఆహ్వానం



అహ్మదాబాద్, తెలంగాణలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందని, వివిధ రంగాల్లో వ్యాపార విస్తరణకు రాష్ట్రం మంచి అవకాశాలను అందిస్తోందని ఐటీ, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గుజరాత్‌కు చెందిన పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రభుత్వం తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను అమలు చేస్తోందని వివరించారు. ఈ లక్ష్య సాధనలో గుజరాత్ పారిశ్రామిక రంగం కూడా భాగస్వామి కావాలని కోరారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరై రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు.

గుజరాత్ పారిశ్రామిక రంగానికి తెలంగాణ ఆహ్వానం

అహ్మదాబాద్‌లోని తాజ్ స్కైలైన్ హోటల్‌లో మంగళవారం తెలంగాణ ప్రభుత్వం, ఫిక్కీ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గుజరాత్ పారిశ్రామికవేత్తలు దేశవ్యాప్తంగా అనేక విజయవంతమైన వ్యాపార సంస్థలను నిర్మించారని ప్రశంసించారు. వారిలో పలువురు ఇప్పటికే తెలంగాణలో తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని గుర్తుచేశారు. చిన్న, మధ్యతరహా సంస్థల నుంచి భారీ పారిశ్రామిక ప్రాజెక్టుల వరకు అన్ని రకాల పెట్టుబడులకు రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు కల్పిస్తున్నామని చెప్పారు. గుజరాత్ వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలను తెలంగాణలోనూ విస్తరించి రెండు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

పెట్టుబడుల అనుకూలతపై అధికారుల వివరణ

తెలంగాణలో ఉన్న పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విధానాలు, వివిధ రంగాల్లో అందుబాటులో ఉన్న అవకాశాలపై రాష్ట్ర అధికారుల బృందం ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చింది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ శశాంక, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఇప్పటికే తెలంగాణలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న పరిశ్రమల ప్రతినిధులు కూడా తమ అనుభవాలను పంచుకున్నారు. రాష్ట్రంలో వ్యాపారాలు నిర్వహించేందుకు ఉన్న సానుకూల పరిస్థితులు, భవిష్యత్తులో విస్తరణకు ఉన్న అవకాశాలను వివరించారు.

పలు రంగాల సంస్థలతో శ్రీధర్‌బాబు చర్చలు

రోడ్‌షో ముగిసిన అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు గుజరాత్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇంధనం, ఫార్మా, వస్త్ర పరిశ్రమలు,రసాయనాలు,ఆహార శుద్ధి, సాంకేతిక రంగాలకు చెందిన సంస్థల ఉన్నతాధికారులతో చర్చించారు.తెలంగాణలో కొత్త పరిశ్రమల స్థాపన, ఇప్పటికే కొనసాగుతున్న వ్యాపారాల విస్తరణ, రెండు రాష్ట్రాల మధ్య పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాలు ఈ సమావేశాల్లో ప్రస్తావనకు వచ్చాయి.

భారత్-ఆసియాన్ దేశాల మధ్య సహకారం పెరగాలి: మోడీ

మనీలా : భారత్ అనుసరిస్తున్న యాక్ట్ ఈస్ట్ విధానం ఆసియాన్ దేశాలతో సంబంధాలకు మరింత బలాన్ని చేకూర్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోది తెలిపారు. భారత్, ఆసియాన్ దేశాలు పరస్పర పోటీకి బదులుగా సహకార మార్గంలో ముందుకు సాగాలని అన్నారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన 23వ భారత్-ఆసియాన్ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఉమ్మడి ప్రయత్నాలతో ప్రాంతీయంగా శాంతి, భద్రత, సుస్థిర అభివృద్ధిని సాధించవచ్చని , ప్రస్తుతం ఈ భాగస్వామ్యం సంస్కృతి, సంప్రదాయాలకే పరిమితం కాకుండా డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, అంతరిక్ష రంగాలకూ విస్తరిస్తోందన్నారు.ప్రపంచ జనాభాలో భారత్, ఆసియాన్ దేశాల వాటా దాదాపు 25 శాతమని గుర్తుచేశారు. రెండు పక్షాలు సమన్వయంతో పనిచేస్తే ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వానికి కొత్త దిశ చూపవచ్చన్నారు. భారత్ ప్రగతి, ఆసియాన్ దేశాల అభివృద్ధి పరస్పరం అనుసంధానమై ఉన్నాయని వివరించారు. ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించేందుకు 2014 నుంచి వందకు పైగా కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రధాని వెల్లడించారు. సుమారు 250 క్విక్ ఇంపాక్ట్ ప్రాజెక్టులు, 10 వేలకు పైగా నైపుణ్యాభివృద్ధి స్కాలర్‌షిప్‌లు అందించినట్లు తెలిపారు. భారత్, ఆసియాన్ దేశాల మధ్య విమాన సర్వీసులు, పర్యాటక రంగం కూడా విస్తరిస్తున్నాయని చెప్పారు.ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలు



ఇరు పక్షాల ఉమ్మడి అభివృద్ధికి దోహదపడతాయని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో శాంతి, స్థిరత్వం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసియాన్ అధ్యక్ష బాధ్యతలను విజయవంతంగా నిర్వహించిన ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌ను మోది అభినందించారు. అనంతరం క్వాడ్ సదస్సులోనూ ఆయన పాల్గొననున్నారు.

సమ్మక్క సాగర్‌పై కీలక ముందడుగు.. రేవంత్‌కు ఛత్తీస్ గఢ్ సీఎం హామీ

హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీకి ఎన్ఓసీ మంజూరు చేసే విషయంలో కీలక ముందడుగు పడింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌తో సమావేశమయ్యారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు వెంటనే ఎన్ఓసీ జారీ చేయడంతో పాటు మిగిలిన అనుమతుల ప్రక్రియకూ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ సానుకూలంగా స్పందిస్తూ, ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎల్‌నినో దృష్ట్యా నీటి నిల్వ కీలకం:

సమావేశంలో భాగంగా ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల వల్ల తెలంగాణలో నీటి అవసరాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఇందులో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. పూర్తి స్థాయి నీటి మట్టం (+83 మీటర్లు) వద్ద ఈ బ్యారేజీ నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలుగా ఉందని, కరువు ప్రభావిత, వెనుకబడిన గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ముంపు తగ్గింపునకు స్థల మార్పు.. ఐఐటీ నివేదిక:

సమ్మక్క సాగర్ ప్రాజెక్టును తొలుత కాంతనపల్లి వద్ద ప్రతిపాదించగా, అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురవడంతో పాటు 17 ఆదివాసీ

డిసెంబర్ 11 నుంచి క్రీడా సంబరం!

హైదరాబాద్, తెలంగాణలో జాతీయ స్థాయి క్రీడా సంబరానికి రంగం సిద్ధమవుతోంది. ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026కు రాష్ట్రం తొలిసారిగా ఆతిథ్యం ఇవ్వనుంది. ఎనిమిదో ఎడిషన్‌లో భాగంగా డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు మొత్తం 12 రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నా యి. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ పోటీలు వేదిక కానున్నాయి.

ఖేలో ఇండియా మస్కట్ 'నీలమణి'

ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ అధికారిక లోగో, మస్కట్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి, ప్రకృతి అందాలకు ప్రతీకగా మస్కట్‌కు 'నీలమణి' అని పేరు పెట్టారు. ఈ క్రీడా పోటీల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సుమారు 8 వేల మంది అథ్లెట్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది పాల్గొననున్నట్లు సమాచారం.

మొత్తం 29 క్రీడా విభాగాల్లో పోటీలు

ఈసారి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మొత్తం 29 క్రీడా విభాగాలు ఉండనున్నాయి. వీటిలో 27 అధికారిక పోటీ క్రీడలు కాగా, మరో రెండు ప్రదర్శన క్రీడలుగా నిర్వహించనున్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌బాల్‌కు ఈ ఏడాది నుంచి అధికారిక పోటీ క్రీడల జాబితాలో చోటు కల్పించారు. అలాగే తెలంగాణ సంప్రదాయ యుద్ధకళ అయిన కర్రసాముతో పాటు సెయిలింగ్‌ను ప్రదర్శన క్రీడలుగా చేర్చారు. దీంతో సంప్రదాయ క్రీడలకు కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుంది.తెలంగాణ వార్తలు

ఆరు నగరాల్లో క్రీడా పోటీలు



ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని ఆరు ప్రధాన నగరాల్లో నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం, గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వంటి వేదికల్లో పలు క్రీడా పోటీలు జరగనున్నాయి.

యువ క్రీడాకారులకు మంచి అవకాశం

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణతో తెలంగాణలో క్రీడా మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. రాష్ట్రంలోని యువతకు జాతీయ స్థాయి పోటీలను ప్రత్యక్షంగా చూసే అవకాశం కలగడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందని భావిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది క్రీడాకారులు, కోచ్‌లు, సందర్శకులు రావడంతో పర్యాటక, ఆతిథ్య రంగాలకు కూడా ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న ఈ క్రీడా ఉత్సవం కోసం తెలంగాణ క్రీడాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



సంపాదకీయం

బుధవారం 18-11-2026

సురక్షిత బ్యాంకింగే లక్ష్యంగా...

దేశీయ బ్యాంకుల లాభాలు పెరిగాయి, మొండి బకాయిలు తగ్గాయి. మరి తదుపరి బ్యాంకింగ్ సంస్కరణల లక్ష్యమేమిటన్న చర్చ తెరపైకి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'వికసిత్ భారత్ కోసం బ్యాంకింగ్ రంగంపై ఉన్నతస్థాయి కమిటీ'ని ఏర్పాటు చేసింది. కేంద్ర మాజీ విజిలెన్స్ కమిషనర్ సురేష్ ఎన్.పటేల్ అధ్యక్షతన దీన్ని కొలువుతీర్చారు. మన బ్యాంకింగ్ వ్యవస్థను ప్రపంచ స్థాయిలో నిలపడంతో పాటు 2047 ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా తీర్చిదిద్దే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించారు. ఈ తరుణంలో ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరు, సాధించిన ప్రగతిని సమీక్షించుకోవడం సముచితం.దేశీయ ప్రభుత్వరంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2018లో గరిష్ఠంగా 14.58శాతానికి చేరుకుంది. తర్వాత అది క్రమంగా తగ్గుతూ మొన్న మార్చి నాటికి 1.93 శాతానికి దిగివచ్చింది. మరోవైపు, ఈ బ్యాంకులు నిరుడు రికార్డు స్థాయిలో రూ.1.98 లక్షల కోట్ల నికర లాభాన్ని ఆర్జించాయి. గడిచిన దశాబ్దకాలంలో బ్యాంకులు సాధించిన పురోగతినీ, రుణాల నాణ్యతలో మెరుగుదలనూ సూచించే గణాంకాలు ఇవి. మొండి బకాయిల సత్వర గుర్తింపు, దివాలా పరిష్కార ప్రక్రియ, బ్యాంకుల విలీనాలు, మెరుగైన రిస్క్ నిర్వహణ, ఆధునిక సాంకేతికతలతో పాటు బ్యాంకుల యాజమాన్యాలు, సిబ్బంది కృషి ఇందుకు దోహదపడ్డాయి. ఇలాంటి తరుణంలో తదుపరి సంస్కరణలు బ్యాంకుల సామర్థ్యాన్ని మరింతగా పెంచడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడగల స్థాయికి వాటిని తీసుకువెళ్లేలా సాగాలి. అదే సమయంలో, 'వికసిత్ భారత్' లక్ష్యాల సాధనలో బ్యాంకుల పాత్రను పునర్నిర్వచించుకోవాల్సిన అవసరమూ ఉంది.

చిన్న సంస్థలపై చిన్నచూపు...

దేశార్థికంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) కీలక భూమిక పోషించడంతో పాటు, సుమారు 38 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రంగానికి విరివిగా రుణాలివ్వడం బ్యాంకింగ్ వ్యవస్థ ముఖ్య బాధ్యత. 2024-25లో షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల మొత్తం రుణాలు 11శాతం వృద్ధి సాధించగా, ఎంఎస్ఎంఈల రుణమొత్తం 14.8శాతం పెరిగింది. కానీ, కొత్త సంస్థలకు ఆ స్థాయిలో రుణాలు మంజూరు కావడంలేదు. భారత చిన్నపరిశ్రమల అభివృద్ధి బ్యాంకు, ట్రాన్స్యూనియన్ సిబిల్ల తాజా నివేదిక 'ఎంఎస్ఎంఈ పల్స్' ప్రకారం... తొలిసారి రుణం పొందిన సంస్థల వాటా 2022-23లో 52శాతం కాగా, నిరుడు అది 42శాతానికి పడిపోయింది. మరోవైపు, 2023 మార్చి నుంచి 2026 మార్చి మధ్య రూ.2-10లక్షల శ్రేణి రుణాల మొత్తం ఏటా సగటున అయిదు శాతం చొప్పునే పెరగ్గా; రూ.10లక్షలు పైబడిన వాటి విలువ రెండంకెల వృద్ధిని నమోదు చేసింది. దీన్నిబట్టి ఎక్కువ మందికి ఉపాధి కల్పించే చిన్న సంస్థలకు ఆశించిన స్థాయిలో రుణాలు అందడంలేదని స్పష్టమవుతోంది. కాబట్టి, రుణ మదింపు, పూచీకత్తు నిబంధనలు, అప్పు పరిమాణం వంటి అంశాల్లో చిన్న సంస్థలకు ఎదురవుతున్న ఇబ్బందులను బ్యాంకింగ్ సంస్కరణల కమిటీ పరిశీలించాలి.ఆర్బీఐ బ్యాంకింగ్ పురోగతి నివేదిక 2024-25 ప్రకారం, ప్రభుత్వరంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2024 మార్చిలో 3.5శాతం నుంచి 2025మార్చి నాటికి 2.6శాతానికి తగ్గింది. కానీ, 31-60 రోజులపాటు బకాయి ఉన్న రుణాల మొత్తాన్ని సూచించే ఎస్ఎంఏ-1 నిష్పత్తి 1శాతం నుంచి 1.3 శాతానికి పెరిగింది. అంటే, మొండి బకాయిలను తగ్గించడంతోపాటు, కొత్తగా ఒత్తిడిలోకి జారుతున్న ఖాతాలపైనా బ్యాంకులు దృష్టి పెట్టాల్సి ఉందని గమనించాలి. బ్యాంకుల్లో నమోదైన లక్ష రూపాయలకు మించిన మోసాలు ఏడాది కాలంలో 23,722 నుంచి 10,114కు దిగివచ్చాయని ఆర్బీఐ నివేదిక వెల్లడించింది. కానీ, వాటి విలువ రూ.32,803 కోట్ల నుంచి రూ.48,021 కోట్లకు పెరిగింది. కాబట్టి, మోసాలను గుర్తించడం, నివారించడంలో బ్యాంకులు మరింత జాగురూకత వహించాలి. డిజిటల్ లావాదేవీలు, ఖాతాల నిర్వహణ, రుణాల మంజూరు, నిధుల బదిలీ వంటి వ్యవహారాల్లో అసాధారణ, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేందుకు ఏఐ పర్యవేక్షణను బలోపేతం చేసుకోవాలి. సైబర్ భద్రతకూ ప్రాధాన్యమివ్వాలి. ఆర్థిక సంస్థల్లో ఏఐ ద్వారా జరుగుతున్న 'క్రాఫ్టీ ఫాల్కన్' సైబర్ దాడులపై సెర్ట్-ఇన్ జారీచేసిన హెచ్చరిక ఈ అవసరాన్ని నొక్కి చెబుతోంది. డిజిటల్ లావాదేవీలు, నిధుల బదిలీ వ్యవస్థలకు పటిష్ఠ భద్రత కల్పించడంతో పాటు, సైబర్ ముప్పును ముందుగానే గుర్తించి సమర్థంగా ఎదుర్కోగల సామర్థ్యాలను బ్యాంకులు పెంపొందించుకోవాలి.

రుణ లభ్యతను విస్తరించాలి

ప్రాధాన్యతా రంగం రుణాల్లో వ్యవసాయానికి 18శాతం; చిన్న, సన్నకారు రైతులకు పదిశాతం ఉపలక్ష్యాలను సాధిస్తున్నప్పటికీ- వాటిని వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఉత్పాదక పెట్టుబడుల పెరుగుదలకు వీలుగా సవరించాలి. మౌలిక సదుపాయాల రుణాల కోసం దీర్ఘకాలిక బాండ్ల జారీకి నిరుడు ఆర్బీఐ జారీచేసిన వనరుల సమీకరణ మార్గదర్శకాలను మరింత విస్తృతంగా వినియోగించుకోవాలి. మరోవైపు, సీనియర్ సిటిజన్ల వంటి ప్రత్యేక శ్రద్ధ అవసరమైన డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణపైనా దృష్టి పెట్టాలి. ప్రభుత్వరంగ బ్యాంకుల మూలధన సమృద్ధి నిష్పత్తి (సీఆర్ఏఆర్) ఈ ఏడాది మార్చి నాటికి కనీస నియంత్రణ ప్రమాణమైన 11.5శాతాన్ని మించి 16.6శాతానికి చేరింది. ఈ నేపథ్యంలో, మూలధన పటిష్ఠతను కొనసాగిస్తూ భవిష్యత్ రుణ విస్తరణకు అవసరమైన అదనపు మూలధన సమీకరణకూ ప్రాధాన్యమివ్వాలి. తదుపరి సంస్కరణలు ఉపాధి కల్పించే రంగాలకు రుణ లభ్యతను విస్తరించడం, రుణాల నాణ్యతను మెరుగు పరచడం, మోసాలను అరికట్టడం, సైబర్ దాడులను తిప్పికొట్టే సామర్థ్యాన్ని పెంచడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. ప్రపంచస్థాయి బ్యాంకులను నిర్మించడం అవసరమే. కానీ భారత ఆర్థిక వ్యవస్థలోని ఉత్పాదక రంగాలకు ఎంత సమర్థంగా నిధులు అందిస్తున్నాయన్నదే బ్యాంకుల పనితీరుకు, దేశ ఆర్థికాభివృద్ధి పట్ల వాటి నిబద్ధతకు అసలైన కొలమానం.

అమెరికాపై ఆధారపడటం తగ్గించనున్న యూరప్...



వాషింగ్టన్:యుద్ధ రంగంలో ఇప్పుడు తుపాకులు, క్షిపణులు, యుద్ధ విమానాలే కాదు.. కృత్రిమ మేధ (ఏఐ) కూడా కీలక ఆయుధంగా మారుతోంది. శత్రువుల కదలికలను గుర్తించడం నుంచి భారీ మొత్తంలో సమాచారాన్ని విశ్లేషించడం, యుద్ధ వ్యూహాలను రూపొందించడం, లక్ష్యాలను నిర్ధారించడం వరకు ఏఐ ఆధారిత సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా సాంకేతికతపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని యూరప్ దేశాలు నిర్ణయించాయి. ముఖ్యంగా సైనిక కార్యకలాపాలకు ఉపయోగించే సాఫ్ట్వేర్ విషయంలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. అమెరికాకు చెందిన పాలంటిర్ టెక్నాలజీస్కు ప్రత్యామ్నాయంగా సొంత సైనిక ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాయి. ఇందులో భాగంగా జర్మనీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ సహా పలు దేశాలు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళుతున్నాయి.

పాలంటిర్కు ప్రత్యామ్నాయం ఎందుకు?

అమెరికాకు చెందిన పాలంటిర్ టెక్నాలజీస్ రూపొందించిన సాఫ్ట్వేర్ వ్యవస్థలు ప్రస్తుతం ప్రపంచ సైనిక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందాయి. వివిధ రకాల సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చి, వాటిని వేగంగా విశ్లేషించడం ఈ వ్యవస్థల ప్రధాన సామర్థ్యం. యుద్ధరంగంలో సైనిక కమాండర్లకు నిర్ణయాలు తీసుకోవడంలో ఇవి సహాయపడుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంలోనూ వీటిని విస్తృతంగా వినియోగిస్తున్నారు.అయితే కీలకమైన సైనిక సమాచార వ్యవస్థల కోసం అమెరికా సంస్థలపై ఆధారపడటం యూరప్ దేశాలకు ఇబ్బందికరంగా మారింది. తమ సైనిక సమాచారం, వ్యూహాత్మక నిర్ణయాలు, సాంకేతిక మౌలిక సదుపాయాలపై పూర్తి నియంత్రణ ఉండాలంటే సొంత వ్యవస్థలు అవసరమని భావిస్తున్నాయి. ఈ క్రమంలో యూరప్ దేశాలు స్థానిక సంస్థలను ప్రోత్సహిస్తూ సైనిక సాఫ్ట్వేర్ అభివృద్ధికి పోటీ పడుతున్నాయి.అయితే పాలంటిర్కు ఉన్న స్థాయి సామర్థ్యం, విస్తృత వినియోగం, యుద్ధరంగ అనుభవం కలిగిన ప్రత్యామ్నాయ వ్యవస్థలు ప్రస్తుతం యూరప్లో అందుబాటులో లేవని పలువురు ప్రభుత్వ, సైనిక అధికారులు అభిప్రాయపడుతున్నారు. కొత్త వ్యవస్థలు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యే వరకు వాటి పనితీరుపై అనిశ్చితి కొనసాగనుంది.

జర్మనీ రంగంలోకి హెల్సింగ్.. 'క్లారిటీ'తో కొత్త ప్రయోగం

సైనిక సాంకేతికతలో స్వయం సమృద్ధి దిశగా జర్మనీ కీలక అడుగులు వేస్తోంది. ఆ దేశానికి చెందిన రక్షణ సాంకేతిక సంస్థ హెల్సింగ్ 'క్లారిటీ' పేరుతో కొత్త సైనిక ఏఐ వ్యవస్థను ఆవిష్కరించింది. భారీ మొత్తంలో సమాచారాన్ని వేగంగా విశ్లేషించి, శత్రు ముప్పులను గుర్తించడంతోపాటు సైనిక అధికారులకు నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడటం దీని ప్రధాన ఉద్దేశం. అవసరమైన సందర్భాల్లో లక్ష్యాల నిర్ధారణ, దాడులకు సంబంధించిన సిఫారసులను కూడా అందించనుంది. వచ్చే ఏడాది నుంచి ఏఐ ఆధారిత సైనిక డేటా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని జర్మనీ యోచిస్తోంది. ఇందుకోసం స్వదేశీ, ఇతర ఐరోపా సంస్థల సాంకేతిక పరిష్కారాలను పరిశీలిస్తోంది. పాలంటిర్ను పరిగణనలోకి తీసుకోకుండా కొన్ని ప్రత్యామ్నాయాలను తుది జాబితాలో చేర్చినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఓ వ్యక్తి వెల్లడించారు.ఈ కొత్త వ్యవస్థలు పాలంటిర్ స్థాయి సామర్థ్యాన్ని వెంటనే అందుకోలేకపోయినా.. జాతీయ డేటా సార్వభౌమత్వాన్ని కాపాడుతూ అవసరమైన పనుల్లో దాదాపు 80 శాతం సామర్థ్యాన్ని ఏడాదిలో సాధించగలవని జర్మనీ భావిస్తున్నట్లు సమాచారం. జర్మనీ సైన్యంలోని లిథువేనియా బ్రిగేడ్కు కొన్ని నెలల్లోనే క్లారిటీ సాఫ్ట్వేర్ ప్రారంభ వెర్షన్ను అందించగలమని హెల్సింగ్ చెబుతోంది.

ఫ్రాన్స్ లక్ష్యం 'ఆర్కాడియా'.. 2027లో సిద్ధం!

యూరప్ సాంకేతిక స్వయంప్రతిపత్తికి బలమైన మద్దతుదారుగా ఉన్న ఫ్రాన్స్ కూడా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. 'ఆర్కాడియా' పేరుతో సార్వభౌమ ఏఐ ఆధారిత సైనిక వేదికను అభివృద్ధి చేస్తోంది. ఇందులో వివిధ సంస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని సమన్వయం చేయనున్నారు.ఈ ఏడాది చివరి నాటికి కనీసం కొన్ని కాంట్రాక్టులను ఖరారు చేయాలని ఫ్రాన్స్ రక్షణ కొనుగోళ్ల సంస్థ భావిస్తోంది. 2027 మధ్య నాటికి క్షేత్రస్థాయిలో వినియోగించగలిగే కార్యాచరణ వ్యవస్థను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని ఫ్రాన్స్ రక్షణ కొనుగోళ్ల సంస్థ డిప్యూటీ అధిపతి అలెగ్జాండర్ లాహౌస్ రాయిటర్స్కు వెల్లడించారు.

నెదర్లాండ్స్ రెండేళ్లలో మార్పు!

ప్రస్తుతం పాలంటిర్కు చెందిన కొన్ని సాఫ్ట్వేర్ వ్యవస్థలను వినియోగిస్తున్న నెదర్లాండ్స్ కూడా ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. రాబోయే రెండేళ్లలో యూరప్లో తయారైన సాఫ్ట్వేర్ వైపు మారాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఆ దేశ సైన్యం వలు సాంకేతిక సంస్థలతో చర్చలు జరుపుతోంది.దేశీయ, ఇతర ఐరోపా సంస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిపి కొత్త వ్యవస్థను రూపొందించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు నెదర్లాండ్స్ ఆయుధ కొనుగోళ్ల మంత్రి డెర్క్ బోస్విక్ తెలిపారు. యూరప్లో ఏఐ, నిర్ణయాత్మక సాంకేతికతకు సంబంధించి అపారమైన పరిజ్ఞానం ఉన్నప్పటికీ.. అది వివిధ సంస్థలు, దేశాల మధ్య విభజితమై ఉండటమే ప్రధాన సమస్యగా ఆయన పేర్కొన్నారు.

నాటోలోనూ పాలంటిర్ హవా

మరోవైపు పాలంటిర్ అభివృద్ధి చేసిన 'మావెన్ స్మార్ట్ సిస్టమ్' అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ ఈ వ్యవస్థను విస్తృతంగా వినియోగిస్తోంది. అమెరికా రక్షణ శాఖ కూడా దీన్ని తన ప్రధాన సైనిక సాఫ్ట్వేర్గా స్వీకరించింది. ఈ ఏడాది ఇరాన్తో జరిగిన యుద్ధంలోనూ దీనిని ఉపయోగించింది.నాటో సైనిక ప్రధాన కార్యాలయం గతేడాదే పాలంటిర్ మావెన్ స్మార్ట్ సిస్టమ్ను స్వీకరించింది. ఈ ఏడాది జూన్లో కూటమి అంతటా సాధారణ సైనిక కార్యకలాపాల్లో వినియోగించేందుకు ఇది సిద్ధంగా ఉందని ప్రకటించింది. విభిన్న రకాల సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చి, సమర్థంగా విశ్లేషించగల సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉందని నాటో అత్యున్నత కమాండర్, అమెరికా వైమానిక దళ జనరల్ అలెక్సస్ గ్రిన్కెవిచ్ గత వేసవిలో రాయిటర్స్కు తెలిపారు.

డేటా భద్రత.. మరో పెద్ద సవాలు

ఏఐ ఆధారిత సైనిక వ్యవస్థల అభివృద్ధి, వినియోగంలో పలు సవాళ్లు ఉన్నాయని జర్మనీ సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ క్రిస్టియన్ ఫ్రాయిడింగ్ పేర్కొన్నారు. డేటా భద్రత, ఏఐ వ్యవస్థలకు శిక్షణ ఇచ్చే విధానం, వివిధ సాంకేతిక వేదికల మధ్య సమన్వయం వంటి అంశాలపై స్పష్టత అవసరమని తెలిపారు. ముఖ్యంగా నాటో వంటి అంతర్జాతీయ కూటముల్లో వివిధ దేశాల సైనిక వ్యవస్థలు పరస్పరం అనుసంధానమై పనిచేయడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

సైలెంట్ గా లోకేష్...



విజయవాడ, వచ్చే అధ్యక్షుడు నారా లోకేషేనని తరచుగా వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తుంటారు. అయితే.. ఇలాంటి వాటికి తాజాగా సీఎం చంద్రబాబు చెక్ పెట్టారు. పార్టీలో వారసత్వ రాజకీయాలు లేవని స్పష్టం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలే అసలైన బలమని, నాయకత్వ అవకాశాలు కేవలం సామర్థ్యం, ప్రజాదరణ ఆధారంగానే దక్కుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై తాను క్లారిటీతోనే ఉన్నానని ఆయన చెప్పుకొచ్చారు. రెండో విడత మున్సిపోల్స్ లో ఆసక్తికర పరిణామం వాస్తవానికి ప్రస్తుతం మంత్రిగా ఉన్న నారా లోకేష్ విషయంలో కేవలం వారసత్వం వల్ల కాకుండా, ఆయనకున్న సానుకూలతలు, క్షేత్రస్థాయిలో చేసిన కృషి ఆధారంగానే పార్టీలో అవకాశాలు దక్కుతున్నాయి. 2014 ఎన్నికల సమయంలో ఐటీడీపీని క్షేత్రస్థాయిలో నడిపి.. పార్టీకి వెన్నెముకగా మారారు. ముఖ్యంగా వస్తున్నా మీ కోసం పాదయాత్ర సమయంలో క్షేత్రస్థాయి కేడర్ను తెరవెనుక ఉండి నడిపించారు. ఫలితంగా పార్టీ విజయ తీరాలకు చేరింది. దీనికి ప్రతిఫలంగానే ఆయనకు ఎమ్మెల్సీ, అనంతరం మంత్రి పదవి దక్కాయి. ఇక, పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, పార్టీని నమ్ముకుని పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని చెప్పే చంద్రబాబు నిజంగానే ఆ పని చేస్తున్నారు. నమ్మకంతో నడిచే పార్టీ నేతలకు ప్రధానంగా పదవులు ఇస్తున్నారు. ఇలా వచ్చిన వారిలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేగల్లా మాధవి పార్టీలో చేరిన మూడేళ్ల కాలంలోనే పొలిట్ బ్యూరో పదవిని దక్కించుకున్నారు. ఇక, లోకేష్ విషయానికి వస్తే.. పార్టీ అధ్యక్ష పగ్గాలు తీసుకుంటారన్న ప్రచారం ఉన్నా.. ఇప్పట్లో కాదన్న సంకేతాలను చంద్రబాబు ఇస్తున్నారు. ఆయన పుంజుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు భావిస్తున్నారు. దీంతో కేంద్రం సహా రాష్ట్ర రాజకీయాలపై పట్టు పెంచుకునేలా ఆయనను ప్రోత్సహిస్తున్నారు. పార్టీ కేవలం ఎన్నికల కోసమే కాకుండా భవిష్యత్ తరాల కోసం పనిచేస్తుందని, యువతకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్న చంద్రబాబు ఇదే కోణంలో నారా లోకేష్ను కూడా తీర్చిదిద్దుతున్నారు. ఏదేమైనా వారసత్వం ముసుగులో పార్టీ పగ్గాలు అప్పగించేది లేదన్న విషయాన్ని చంద్రబాబు తేల్చేయడంతో విమర్శలకు అడ్డుకట్ట పడిందని అంటున్నారు.విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి నారా లోకేష్, ప్రముఖ పారిశ్రామికవేత్త ఉపాసన కామినేని కొణిదెల మధ్య జరిగిన ప్రత్యేక ప్యానల్ చర్చ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచింది. యంగ్ ఆంధ్ర ? డ్రైవింగ్ ఆంధ్ర అనే అంశంపై సాగిన ఈ ఇంటరాక్టివ్ సెషన్ ఆద్యంతం ఉత్సాహభరితంగా, స్ఫూర్తిదాయకంగా సాగడంతో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా ఉపాసన మాట్లాడుతూ, తాను ఒక రాక్స్టార్ మినిస్టర్ పక్కన కూర్చున్నానని నారా లోకేష్ను అభినందించడం సభలో ఒక్కసారిగా ఉత్సాహాన్ని నింపింది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ సమయంలోనే ఏపీకి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడంలో నారా లోకేష్ కనబరుస్తున్న చొరవను ఉపాసన ప్రత్యేకంగా కొనియాడారు.పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన విధానాలతో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. దీనికి బదులుగా లోకేష్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా, కంపెనీలతో చేయి కలిపిన క్షణం నుంచే అది తమ ప్రాజెక్టుగా భావించి వేగంగా గ్రౌండ్ అయ్యేలా చూస్తోందని స్పష్టం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన ఆత్మవిశ్వాసంతో వివరించారుకేవలం ఐటీ, తయారీ రంగాలకే పరిమితం కాకుండా, ఆంధ్రప్రదేశ్ను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఉపాసన ఈ వేదికపై ఒక అద్భుతమైన ప్రతిపాదన చేశారు. తిరుమల శ్రీవారితో తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూనే, రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను కలుపుతూ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు రెట్టింపు అవుతాయని సూచించారు.ఉపాసన ఆలోచనను స్వాగతించిన నారా లోకేష్, పారిశ్రామిక ప్రగతితో పాటు ఆలయ పర్యాటక రంగాన్ని కూడా సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు.పెట్టుబడుల చర్చల మధ్యలో ఇరువురి మధ్య సాగిన సరదా సంభాషణలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ముఖ్యంగా ర్యాపిడ్ ఫైర్ రౌండ్లో లోకేష్ తనదైన శైలిలో వేసిన చలోక్తులకు ఉపాసనతో పాటు సభలోని వారంతా పగలబడి నవ్వారు. తన సతీమణి బ్రాహ్మణి తనకంటే ఎక్కువ సంపాదిస్తుందని, తన క్రెడిట్ కార్డ్ బిల్లులన్నీ ఆమే కడుతుందని లోకేష్ నవ్వుతూ చెప్పడం, అలాగే పాఠ్యపుస్తకాల్లో ఇంటి పనిని 50-50 శాతం పంచుకునేలా మార్పులు తెచ్చామంటూ మహిళా సాధికారత గురించి ఆయన చెప్పిన విషయాలు అందరి మనసులను గెలుచుకున్నాయి.మొత్తంగా ఈ చర్చలో అటు పాలనలో యువ రక్తం తెస్తున్న మార్పులు, ఇటు పారిశ్రామిక వేత్తల ఆకాంక్షలు అద్భుతంగా ప్రతిబింబించాయి. 2035 నాటికి ఆంధ్రప్రదేశ్ను అత్యంత సంతోషకరమైన, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో సాగిన ఈ సంభాషణ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఒకవైపు లోకేష్ విజన్,మరోవైపు ఉపాసన సామాజిక దృక్పథం కలగలిసిన ఈ ప్యానల్ డిస్కషన్, విశాఖ సీఐఐ సదస్సుకే హైలైట్గా నిలిచి నవ్యాంధ్ర ప్రగతిపై సరికొత్త ఆశలను రేకెత్తించింది.

నమ్మకస్తులే బద్ధశత్రువులు

గుంటూరు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్థానం ఒక సంచలనమైతే.. ఆయన ఎదుగుదల వెనుక నిస్వార్థంగా నిలబడి, కష్టకాలంలో భుజం కాసిన అత్యంత నమ్మకస్తులే కాలక్రమంలో ఆయనకు బద్ధశత్రువులుగా మారిపోవడం అంతకంటే పెద్ద విస్మయం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత, సీబీఐ కేసుల్లో జగన్ జైలుకు వెళ్లినప్పుడు, సుదీర్ఘ కాలం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన రక్తసంబంధీకులు, ఆప్తులు నేడు ఆయనకు దూరమయ్యారు. తాజాగా నాలుగు దశాబ్దాల పాటు వైఎస్ కుటుంబానికి ఆర్థిక, రాజకీయ మూలస్తంభంగా ఉండి, వైఎస్సార్సీపీలో నంబర్-2గా చక్రం తిప్పిన విజయసాయిరెడ్డి సైతం పరివర్తన రాజనీతి పార్టీ పేరిట సొంత కుంపటి పెట్టుకుని జగన్కే సవాలు విసరడం అసలు తప్పు ఎక్కడ జరుగుతోందనే చర్చకు తెరలేపింది.జగన్కు ఆప్తులు దూరమయ్యే పరంపర మొదట ఆయన సొంత ఇంటి నుంచే ప్రారంభమైంది. జగన్ జైల్లో ఉన్నప్పుడు 3,112 కిలోమీటర్ల పాదయాత్ర చేసి పార్టీని బతికించిన చెల్లెలు వైఎస్ షర్మిల, పార్టీ గౌరవాధ్యక్షురాలిగా అండగా నిలిచిన కన్నతల్లి వైఎస్ విజయమ్మ చివరకు అవమానభారంతో పార్టీని వీడాల్సి వచ్చింది. ఆస్తుల పంపకాలు, రాజకీయ ఆధిపత్యం విషయంలో జగన్ ప్రదర్శించిన కఠిన వైఖరి వల్ల రక్తసంబంధం సైతం తెగిపోయింది. ఇక బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య తర్వాత, ఆయన కుమార్తె డాక్టర్ సునీతకు న్యాయం చేయకపోగా, నిందితులకే అండగా నిలిచారన్న ఆరోపణలతో సొంత చిన్నాన్న కుటుంబమే నేడు జగన్పై న్యాయపోరాటం చేస్తోంది.కుటుంబ సభ్యులే కాకుండా, జగన్ కోసం పదవులను త్యాగం చేసిన అత్యంత సన్నిహిత బంధువులు, మేనమామలు సైతం ఆయన తీరుతో విసిగిపోయి బయటకు వచ్చారు. దశాబ్దాలుగా వైఎస్ కుటుంబానికి అండగా ఉండి, పార్టీ కోసం పనిచేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీలో తనకు దక్కుతున్న అవమానాలు, కోటరీ రాజకీయాలను భరించలేక జనసేన గూటికి చేరారు. అలాగే, 2019 ఎన్నికల్లో జగన్ గెలుపు కోసం జాతీయ మీడియాలో, ఢిల్లీ స్థాయిలో అహర్నిశలు శ్రమించిన రఘురామకృష్ణంరాజు.. అధికారంలోకి వచ్చాక జగన్ నిరంకుశ పోకడలను ప్రశ్నించినందుకు ఏకంగా రాజద్రోహం కేసులు, కస్టోడియల్ వేధింపులను ఎదుర్కొని బద్ధశత్రువుగా మారారు. అందరికంటే సంచలనం విజయసాయిరెడ్డి నిష్క్రమణ. 1980ల నుంచి వైఎస్సార్కు ఆడిటర్గా, జగన్ ఆర్థిక సామ్రాజ్యానికి వ్యూహకర్తగా ఉండి, అక్రమాస్తుల కేసుల్లో జగన్తో పాటు జైలు జీవితం కూడా అనుభవించిన విజయసాయిరెడ్డి.. తాడేపల్లి కోటరీ తనను ద్రోహి గా ముద్ర వేయడాన్ని జీర్ణించుకోలేకపోయారు. విధేయత అంటే బానిసత్వం కాదు" అంటూ బయటకు వచ్చిన ఆయన, ఏకంగా కుటుంబ, ఆధిపత్య రాజకీయాలకు ముగింపు పలుకుతానంటూ సొంత పార్టీని స్థాపించి జగన్ను నేరుగా ఢీకొడుతున్నారు.ఈ వరుస పరిణామాలను లోతుగా విశ్లేషిస్తే.. సమస్య ఎక్కడుందనేది స్పష్టమవుతోంది. రాజకీయాల్లో వాడుకుని వదిలేసే మనస్తత్వం, అధికారం చేతికి వచ్చాక కష్టకాలంలో తోడున్న వారిని పక్కనబెట్టి ఒక ప్రత్యేక కోటరీ మాటలకే ప్రాధాన్యత ఇవ్వడం జగన్కు శాపంగా మారింది. తన చుట్టూ ఉన్నవారు తనకు సలహాలు ఇచ్చే భాగస్వాములుగా కాకుండా, కేవలం తన ఆజ్ఞలను శిరసావహించే విధేయులుగా మాత్రమే ఉండాలని జగన్ భావించడమే ఈ విచ్ఛిన్నానికి ప్రధాన కారణమని రాజకీయ భావిస్తున్నారు. కన్నతల్లి విజయమ్మ నుంచి కీలక వ్యూహకర్త విజయసాయిరెడ్డి వరకు ఒక్కొక్కరుగా జగన్ను వీడి వెళ్లడం యాదృచ్ఛికం కాదు. అది ఆయన నాయకత్వ శైలిలోని లోపాలకు అద్దం పడుతోందని అనుకోవచ్చు. కష్టకాలంలో భుజం కాసిన వారిని గౌరవించుకోలేని నాయకత్వం దీర్ఘకాలంలో ఒంటరిగా మిగిలిపోతుందనే సత్యాన్ని ఏపీ రాజకీయాలు మరోసారి నిరూపిస్తున్నాయి. సొంత మనుషులనే కాపాడుకోలేకపోయిన జగన్, రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయి కేడర్ను, ఓటు బ్యాంకును ఎలా కాపాడుకుంటారనేది ఇప్పుడు అతిపెద్ద ప్రశ్నగా మారింది.

వియత్నం కార్లతో 30వేల జీతం

హైదరాబాద్, హైదరాబాద్ లాంటి మహానగరంలో అవసరాలకు సరిపడా సౌకర్యాలు ఎప్పుడూ గగనమే.. దాన్ని ఆసరాగా చేసుకొని సంపాదించాలే కానీ ఎ

మెగాస్టార్ చుట్టూ ఊహాగానాలు...మ్యాటర్ మాత్రం ?

హైదరాబాద్, మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో అందరి వాడు. పరిశ్రమకు పెద్ద దిక్కు. ఆయన పెద్దరికం మీద అందరికీ నమ్మకం ఉంది. అనేక సమస్యలను ఆయన పరిష్కరిస్తూ వస్తున్నారు. ఇక చిరంజీవి స్వభావానికి రాజకీయాలు పడవని సన్నిహితులు అంటారు. ఆయన మెత్తని స్వభావం కలిగిన వారు. అందుకే ఆయన రాజకీయాల్లోకి ఎంత తొందరగా వెళ్లాలో అంతే వేగంగా వెనక్కి తిరిగారు. అది కూడా ఎలాంటి విమర్శలు పెద్దగా లేకుండానే గౌరవంగా తప్పుకున్నారు. ఇక తన జీవితం అంతా సినిమాలకే అంకితం అని ఆయన పదే పదే అనేక సార్లు చెప్పి ఉన్నారు. అయినా సరే మెగాస్టార్ చుట్టూ ఎపుడూ రాజకీయ ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. ఆయన విషయంలో మరోసారి అలాంటి వార్తలే ప్రచారంలో ఉంటూ వస్తున్నాయి.ఇదిలా ఉంటే హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి బీజేపీ అగ్ర నేత అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి ఆయన కుమారుడు రామ్ చరణ్ తో పాటుగా వెళ్ళి కలిశారు. ఇది మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నా కూడా చిరంజీవి రాజకీయం గురించి మరోసారి చర్చించే విధంగా వార్తా కథనాలు అల్లుతున్న వారూ ఉన్నారు. అయితే అమిత్ షాను కలిసిన ప్రముఖులలో అనేక రంగాలకు చెందిన వారు ఉన్నారు. అందులో మై హోం నుంచి రామేశ్వరరావు, అలాగే ఒక ప్రముఖ తెలుగు టీవీ చానెల్ అధినేత ఇంకా అనేక మంది ఉన్నారు. అయితే అందరి దృష్టి మాత్రం మెగాస్టార్ మీదనే ఉంది. ఎందుకంటే ఆయన సినీ దిగ్గజం, కేంద్ర మాజీ మంత్రి, అంతే కాదు జనసేన అధినేత పవన్ కి సోదరుడు కాబట్టి అని అంటున్నారు. ఇక పవన్ ఏపీలో కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం గా ఉన్నారు. ఆ కూటమిలో బీజేపీ కూడా ఉంది. అలా ఆ బంధాన్ని కూడా కలుపుతూ చిరంజీవి రాజకీయాల మీద చర్చించే వారూ ఉన్నారు..అయితే అమిత్ షాని చిరంజీవి కలవడం వెనక రాజకీయం లేదని అంటున్నారు. కేవలం మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్ సినీ రంగం పరిస్థితులలో పాటు తమ సినిమాల గురించి చర్చకు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఇక చిరంజీవి విషయానికి వస్తే ఆయన రాజకీయంగా అందరి వాడుగా ఉన్నారని గుర్తు చేస్తున్నారు. ఆయనకు పార్టీలతో సంబంధం లేదని కూడా అంటున్నారు. ఏపీలో ఈ మధ్య పర్యటించిన మెగాస్టార్ కూటమి ప్రభుత్వం పాలన బాగుందని చెప్పారని అంటున్నారు. అలాగే రేవంత్ రెడ్డితో కూడా అనేక వేదికలు పంచుకున్నారని అంటున్నారు. ఇలా అందరి వాడుగా ఉంటూ వస్తున్న చిరంజీవి రాజకీయాలలో క్రియాశీలకం అవుతారు అన్నది కేవలం ఊహాగానాలే అని అంటున్నారు. అయితే కమలం పార్టీకి ఆశలు మాత్రం ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ కూటమిలో ఉన్నారు. చిరంజీవి వంటి బిగ్ ఫిగర్ కనుక తమతో ఉంటే తెలంగాణాలో కూడా అధికారానికి మరింత సులువు అవుతుందన్న లెక్కలు బీజేపీకి ఉన్నాయని చెబుతున్నారు. అయితే చిరంజీవి తిరిగి రాజకీయాల్లోకి వస్తారా అంటే అది ఈజీ కాదు కదా అసలు కుదిరే వ్యవహారం కానే కాదని అంటున్నారు. ఒక విధంగా చిరంజీవి రాజకీయం అన్నది ముగిసిన అధ్యాయం అని కూడా అంటున్నారు. అయితే కాలం ఎపుడూ గొప్పది చూడాలి మరి ఊహాగానాలు అలాగే ఉంటాయా లేక ఏమవుతాయి అన్నది.

ఐదు ఇండస్ట్రీస్ పై పీసీబీపై వేటు

మెదక్, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్, కొల్లూరులో నిర్మాణ ప్రాజెక్టుల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో వాయు కాలుష్యం పెరుగుతుండటంపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కఠిన చర్యలకు సిద్ధమైంది. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించిన ఐదు నిర్మాణ ప్రాజెక్టులతోపాటు, ఒక రెడీ మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) ప్లాంట్‌ను మూసివేయాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సిఫారసు చేసింది. వీటికి సంబంధించిన బ్యాంకు గ్యారంటీలను కూడా జప్తు చేయాలని సూచించింది. సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఈ ప్రాంతాల్లో భారీ నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతుండటంతో పరిసర ప్రాంతాల్లో దుమ్ము, ధూళి సమస్య తీవ్రమవుతోంది. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో పీసీబీ ప్రత్యేక దృష్టి సారించింది. సనత్‌నగర్‌లోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో 16 నిర్మాణ ప్రాజెక్టుల పనితీరుపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని రోలింగ్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పలు ప్రాజెక్టుల వద్ద పర్యావరణ నిబంధనలు పాటించడం లేదని, దుమ్ము నియంత్రణకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో వాయు కాలుష్యం పెరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఐదు నిర్మాణ ప్రాజెక్టుల కార్యకలాపాలను నిలిపివేయాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సిఫారసు చేసింది.అదేవిధంగా ఒక నిర్మాణ ప్రాజెక్టుకు అనుబంధంగా పనిచేస్తున్న ఆర్ఎంసీ ప్లాంట్‌లోనూ తీవ్రమైన ఉల్లంఘనలు గుర్తించారు. పీసీబీ నుంచి అవసరమైన అనుమతులు తీసుకోకుండానే ప్లాంట్ నిర్వహిస్తుండటంతోపాటు, కాలుష్య నియంత్రణకు అవసరమైన ఏర్పాట్లు చేయలేదని తనిఖీల్లో వెల్లడైంది. కాంక్రీట్ తయారీ సమయంలో వెలువడే ధూళిని నియంత్రించకపోవడం వల్ల పరిసర ప్రాంతాల గాలి నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ ప్లాంట్ కార్యకలాపాలను కూడా తక్షణమే నిలిపివేయాలని కమిటీ సిఫారసు చేసింది.నిర్మాణ రంగ కార్యకలాపాల కారణంగా నివాస ప్రాంతాల్లో వాయు కాలుష్యం పెరగకుండా చూడటంతోపాటు, పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠినంగా వ్యవహరించాలన్న ఉద్దేశంతో పీసీబీ ఈ చర్యలకు ఉపక్రమించింది. ప్రాజెక్టుల మూసివేతతోపాటు బ్యాంకు గ్యారంటీల జప్తునకు సంబంధించిన సిఫారసులపై తదుపరి చర్యలు తీసుకోనుంది.

పునర్విభజన బిల్లుకు ఎన్సీపీ మద్దతు

ముంబై, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయంలో ఇండియా కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న ఎన్సీపీ శరద్ పవార్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే మద్దతు పలికారు. దేశవ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన కాకుండా, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాల్లో సమానంగా ఫ్లాట్ ఫార్ములాతో 50 శాతం లోక్‌సభ స్థానాలను పెంచే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తే తమ పార్టీ దానికి సానుకూలంగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన సొంత నియోజకవర్గమైన బారామతిని ఉదాహరణగా చూపుతూ?గతంలో 10?12 లక్షలుగా ఉన్న ఓటర్ల సంఖ్య నేడు 20?22 లక్షలకు పెరిగిందని, కేవలం రూ. 5 కోట్ల ఎంపీ నిధులతో ప్రతి గ్రామానికి న్యాయం చేయడం సాధ్యం కావడం లేదని, మెరుగైన పాలన కోసం నియోజకవర్గాల విభజన అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.అయితే, సుప్రియా సూలే ప్రకటనపై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ నుంచి భిన్నమైన స్పందన వ్యక్తమైంది. డీలిమిటేషన్‌కు మద్దతు ఇవ్వాలనుకుంటే అది వారి పార్టీ వ్యక్తిగత నిర్ణయం కావొచ్చు, కానీ అందులో ఇండియా కూటమి లేదా కాంగ్రెస్ పేరును ప్రస్తావించవద్దు అని కాంగ్రెస్ స్పందించింది. లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల పరిధిలోనే పునర్విభజన జరగాలని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. మరోవైపు, జులైలో కేంద్రం నిర్వహించిన సమావేశంలో సమానంగా 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదన చర్చకు వచ్చిందని, అయితే ఇప్పటివరకు అధికారికంగా బిల్లు ముసాయిదా ఏదీ తమకు అందలేదని, తుది నిర్ణయం తీసుకునే ముందు కూటమి భాగస్వాములతో చర్చిస్తామని సుప్రియా సూలే వివరణ ఇచ్చారు.

డిజిటల్ ట్విన్ టెక్నాలజీతో నీటి వృధాకు చెక్...



హైదరాబాద్, నీటి వృథాను అరికట్టేందుకు హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ పరిశోధకులు 'డిజిటల్ ట్విన్' టెక్నాలజీని సూచిస్తున్నారు. ఈ విధానంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, కార్యాలయాలు, పరిశ్రమల్లో కనీసం 20 శాతం నీటిని ఆదా చేయవచ్చని చెబుతున్నారు. పైప్‌లైన్లు, ట్యాంకులు, వాల్వులకు సెన్సర్లు అమర్చి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో అనుసంధానిస్తారు. ఎక్కడ లీకేజీలు ఉన్నా, నీటి ఒత్తిడి తగ్గినా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం అందుతుంది. అవసరమైతే అక్కడి నుంచే వాల్వులను కంట్రోల్ చేయవచ్చు. అపార్ట్‌మెంట్లలో ప్రతి ఫ్లాట్ ఎంత నీటిని వినియోగిస్తోందో కూడా తెలుసుకోవచ్చు. నల్లాలు తెరిచి వదిలేస్తే హెచ్చరికలు ఇవ్వడంతో పాటు ఆటోమేటిక్‌గా మూసివేసే అవకాశమూ ఉంటుంది. నీటి నాణ్యతను పర్యవేక్షించేందుకు కూడా ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది.నీటి వృథాను అరికట్టి భవిష్యత్తు అవసరాల కోసం నీటిని పొదుపు చేసేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తోంది. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో.. రానున్న రోజుల్లో నీటి కొరత రానుందనే హెచ్చరికల నేపథ్యంలో ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడుకోవడం కూడా చాలా అవసరం. ఈ నేపథ్యంలోనే ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఆఫీసులు, పరిశ్రమల్లో నీటి వినియోగాన్ని పర్యవేక్షిస్తూ వృథాను తగ్గించేలా 'డిజిటల్ ట్విన్' వ్యవస్థను ఉపయోగించుకోవచ్చని హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ) స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ పరిశోధకులు సూచిస్తున్నారు. ఈ విధానంతో కనీసం 20 శాతం నీటి వృథాను అరికట్టవచ్చని చెబుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఈ టెక్నాలజీ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని వివరిస్తున్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఒక వ్యక్తికి రోజుకు సుమారు 130 లీటర్ల నీరు అవసరం అవుతుంది. అయితే తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో ప్రజలు స్థానిక సంస్థలు సరఫరా చేసే నీటితో పాటు వ్యక్తిగత బోర్లు, ఇతర నీటి వనరులపై ఆధారపడుతున్నారు. ఈ నీటిని వినియోగించే క్రమంలో పెద్ద మొత్తంలో వృథా చేస్తున్నారు. స్నానం చేయడం, దుస్తులు ఉతకడం, వంట పాత్రలు శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పోయడం, వాహనాలు కడగడం వంటి పనుల్లో అవసరానికి మించి నీటిని వినియోగిస్తున్నారు. మరోవైపు.. ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగవచ్చన్న అంచనాల నేపథ్యంలో నీటి పొదుపుపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.నీటి సరఫరా వ్యవస్థను డిజిటల్ రూపంలో పర్యవేక్షిస్తూ.. ఎక్కడ ఎంత నీరు వినియోగిస్తున్నారు.. ఎక్కడ లీకేజీలు జరుగుతున్నాయి.. ఎక్కడ నీటి ఒత్తిడి తగ్గుతోంది.. వంటి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే సాంకేతిక విధానమే డిజిటల్ ట్విన్. ఇందుకోసం నీటి సరఫరా పైప్‌లైన్లు, స్టోరేజ్ ట్యాంకులు, వాల్వులకు ప్రత్యేక సెన్సర్లను అమర్చుతారు. వీటిని ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) టెక్నాలజీతో అనుసంధానిస్తారు. ఉదాహరణకు హైదరాబాద్ నగరానికి రోజుకు 500 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తుంటే.. వివిధ కారణాలతో 20 నుంచి 25 శాతం నీరు వృథా అవుతోందని అంచనా. డిజిటల్ ట్విన్ వ్యవస్థ ద్వారా ఈ వృథాను గుర్తించి కంట్రోల్ చేయవచ్చని చెబుతున్నారు.పైప్‌లైన్‌లో ఎక్కడైనా పగుళ్లు ఏర్పడినా, నీటి ఒత్తిడి తగ్గినా, స్టోరేజ్ ట్యాంకుల నుంచి సరఫరాలో సమస్య వచ్చినా కమాండ్ కంట్రోల్ కేంద్రంలోని తెరపై వెంటనే సమాచారం కనిపిస్తుంది. పైప్‌లైన్ పగిలినప్పుడు సిబ్బంది అక్కడికి వెళ్లి వాల్వులు మూసే వరకు వేచి చూడాల్సిన అవసరం ఉండదు. సిమ్యులేటర్ సాఫ్ట్‌వేర్ సాయంతో కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచే సంబంధిత వాల్వులను నిలిపివేయవచ్చు. ఈ విధానాన్ని అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లోనూ అమలు చేయవచ్చు. ప్రతి ఫ్లాట్‌కు నీరు సరఫరా చేసే పైపులకు సెన్సర్లు అమర్చడం ద్వారా ఏ ఇంట్లో ఎంత నీరు వినియోగిస్తున్నారో తెలుసుకోవచ్చు. ఉదాహరణకు ఒక ఫ్లాట్‌లో నలుగురు నివసిస్తుంటే రోజుకు 520 లీటర్ల నీరు సరిపోతుందని అంచనా వేస్తే.. అదే ఫ్లాట్‌లో 900 లీటర్లు వినియోగిస్తున్నారంటే అవసరానికి మించి నీటిని వాడుతున్నట్లు గుర్తించవచ్చు. తద్వారా వినియోగదారులను అప్రమత్తం చేసి నీటి వృథాను తగ్గించవచ్చు. అంతేకాదు.. పైప్‌లైన్లు, సంపులు, ట్యాంకుల్లో లీకేజీలు ఏర్పడితే సెన్సర్లు వెంటనే గుర్తించి డాష్‌బోర్డుకు సమాచారం పంపిస్తాయి. ఇంట్లో ఎవరైనా నల్లా తెరిచి అలాగే వదిలేసినా, చిన్నపిల్లలు బాత్‌రూమ్, సింక్ వద్ద నల్లా మూయడం మర్చిపోయినా సంబంధిత ఫ్లాట్‌లో హెచ్చరికలు జారీ చేయవచ్చు. వారు స్పందించకపోతే సెన్సర్ల సాయంతో ఆటోమేటిక్‌గా నల్లాను మూసివేసే అవకాశం కూడా ఉంటుంది.గేటెడ్ కమ్యూనిటీల్లో రోజులో ఏ సమయాల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందో సెన్సర్ల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ వివరాల ఆధారంగా నీటి సరఫరా ఒత్తిడిని కంట్రోల్ చేయవచ్చు. 24 గంటలూ నీటి సరఫరా కొనసాగిస్తూనే.. అవసరమైన సమయాల్లో ఎక్కువ ఒత్తిడితో, వినియోగం తక్కువగా ఉన్న సమయాల్లో ఒత్తిడిని తగ్గించడం ద్వారా 10 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ఈ డిజిటల్ ట్విన్ వ్యవస్థతో కేవలం నీటి వృథాను అరికట్టడమే కాకుండా మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొంటున్నారు.నీటి నాణ్యత, కాలుష్య ప్రభావాన్ని నిరంతరం పర్యవేక్షించవచ్చు. కలుషిత నీటి కారణంగా వ్యాపించే వ్యాధులను ముందుగానే గుర్తించి కంట్రోల్ చేసే అవకాశాలు ఉంటాయి. ఒకసారి ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తే నిరంతరం పనిచేస్తుందని ప్రస్తుతం నీటి నిర్వహణ కోసం చేస్తున్న ఖర్చుతో పోలిస్తే తక్కువ వ్యయంతోనే దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చని ట్రిపుల్ ఐటీ స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం వివరించారు. నీటి కొరత ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో టెక్నాలజీ ఉపయోగించి ప్రతి చుక్క నీటినీ సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఈ విధానం సూచిస్తోంది.

అండర్ గ్రౌండ్ లోకి హఫీజ్ సయీద్,మసూద్ అజార్

ముంబై, భారత్‌పై ఉగ్రదాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు కీలక ఉగ్రవాద నేతలు హఫీజ్ సయీద్, మసూద్ అజార్‌ల విషయంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం. భారత దాడుల భయం, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ వారిద్దరినీ రహస్యంగా వేర్వేరు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య వారిని ఉంచినట్లు తెలుస్తోంది.వివరాల్లోకి వెళ్తే.. లష్కరే తోయిబా అధినేత హఫీజ్ సయీద్‌ను లాహోర్‌లోని జోహర్ టౌన్ నుంచి రావల్పిండిలోని గారిసన్ గ్రౌండ్ ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. ఈ ప్రాంతం పాకిస్థాన్ సైనిక ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఉండటం గమనార్హం. మరోవైపు జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌ను సింధ్ ప్రావిన్స్‌లోని నవాబ్‌షాలో ఉన్న రహస్య నివాసానికి తరలించినట్లు నిఘా వర్గాలు పేర్కొంటున్నాయఈ మార్పుల వెనుక ప్రధాన కారణం ఆపరేషన్ సింధూర్ ప్రభావమేనని నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన దాడులతో ఉగ్ర సంస్థలకు భారీ నష్టం వాటిల్లింది. అంతేకాకుండా పాకిస్థాన్‌లో భారత్ వ్యతిరేక ఉగ్రవాదులు వరుసగా హతమవుతున్న నేపథ్యంలో ఐఎస్ఐ అప్రమత్తమైనట్లు సమాచారం.హఫీజ్ సయీద్ తన సంస్థ సభ్యులను నేరుగా కలవడం కూడా తగ్గించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆడియో సందేశాల ద్వారానే లష్కరే తోయిబా కార్యకర్తలతో మాట్లాడుతున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆయన కదలికలపై ఆంక్షలు విధించడంతో పాటు భద్రతను మరింత పెంచినట్లు సమాచారం. పాకిస్థాన్ మాత్రం సయీద్ కోట్ లఖ్‌పత్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడని చెబుతుండగా, అతను సురక్షిత నివాసంలో ఉన్నాడని భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. మరోవైపు మసూద్ అజార్‌కు చెందిన జైషే మహమ్మద్ సంస్థ కూడా తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో బహవల్పూర్‌లోని ఆ సంస్థ ప్రధాన స్థావరం మర్కజ్‌పై దాడులు జరగడంతో కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అప్పటి నుంచి సంస్థను తిరిగి బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అజార్ సైతం తన అనుచరులతో ప్రత్యక్ష సంబంధాలను తగ్గించుకుని, కొద్దిమంది కీలక కమాండర్లతో మాత్రమే సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఐక్యరాజ్యసమితి ఇప్పటికే హఫీజ్ సయీద్, మసూద్ అజార్‌లను అంతర్జాతీయ ఉగ్రవాదులుగా ప్రకటించింది. 26/11 ముంబై ఉగ్రదాడులతో పాటు పలు దాడుల కేసుల్లో సయీద్ భారత్‌కు వాంటెడ్‌గా ఉన్నాడు. పుల్వామా, పఠాన్‌కోట్, పార్లమెంట్ దాడులతో సంబంధాలున్నట్లు అజార్‌పై ఆరోపణలు ఉన్నాయి. అయితే వీరిద్దరినీ నిజంగానే కొత్త రహస్య స్థావరాలకు తరలించారా? ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? అనే విషయాలపై అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది. నిఘా వర్గాల సమాచారం ప్రకారం ఈ పరిణామాలు నిజమైతే, పాకిస్థాన్‌లో ఉగ్రవాద నేతల భద్రతపై పెరుగుతున్న ఆందోళనలకు ఇవి సంకేతాలుగా భావించవచ్చు.

మూడు రాష్ట్రాల మధ్య రైల్వే లైన్...

శ్రీకాకుళం,ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఏపీ మీదుగా తెలంగాణలోని భద్రాచలం, పాండురంగాపురం వరకు నిర్మించనున్న 173.61 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్‌కు పోలవరం జలాశయం ముంపు సమస్య ఎదురైంది. ఏపీలోని పోలవరం జిల్లా పరిధిలో 65 కిలోమీటర్ల మేర ప్రతిపాదిత మార్గం ముంపు ప్రాంతంలోకి వస్తున్నట్లు గుర్తించడంతో ఎలైన్‌మెంట్ మార్చేందుకు అధికారులు సర్వే చేస్తున్నారు. మార్గం మారితే కొత్త స్టేషన్లు, టన్నెల్స్ నిర్మించాల్సి రావడంతో రూ. 2,864 కోట్ల ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశముంది.ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లా మీదుగా తెలంగాణలోని భద్రాచలం, పాండురంగాపురం వరకు నిర్మించనున్న కొత్త రైల్వే లైన్‌కు పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతం అడ్డంకిగా మారింది. ఈ మార్గంలోని సుమారు 65 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ ముంపు పరిధిలో ఉన్నట్లు భూసేకరణ సమయంలో అధికారులు గుర్తించారు. దీంతో ప్రతిపాదిత రైల్వే మార్గం మార్చేందుకు రైల్వే శాఖ క్షేత్రస్థాయిలో మరోసారి సర్వే చేపట్టింది. ముంపు గ్రామాలకు ఎగువన అనువైన మార్గాన్ని గుర్తించే పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. సర్వే నివేదికను త్వరలో రైల్వే బోర్డుకు పంపించనున్నారు.మల్కన్‌గిరి నుంచి భద్రాచలం, పాండురంగాపురం వరకు 173.61 కిలోమీటర్ల పొడవున పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాల మీదుగా కొత్త రైల్వే లైన్ నిర్మించేందుకు రైల్వే శాఖ ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ మార్గంలో ఒడిశాలోని మల్కన్‌గిరితోపాటు బడలి, పనిమట, రాజన్‌గూడ, లచ్చిపేట, కందపల్లి, మోటు ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో కుయుగూరు, సీతారామపురం, భీమవరం, రాజుపేట, తెలంగాణలోని భద్రాచలం, సారపాకలో స్టేషన్లు ప్రతిపాదించారు. చివరగా పాండురంగాపురం స్టేషన్ వద్ద ప్రస్తుతం ఉన్న డోర్నకల్-భద్రాచలం రోడ్-మణుగూరు రైల్వే లైన్‌కు ఈ మార్గాన్ని అనుసంధానించనున్నారు. ఈ లైన్ అందుబాటులోకి వస్తే మూడు రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ పెరగనుంది.ఈ రైల్వే లైన్ ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లా పరిధిలో చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల మీదుగా సుమారు 65 కిలోమీటర్ల మేర ప్రయాణించనుంది. ఈ మార్గంలోనే కుయుగూరు, సీతారామపురం, భీమవరం, రాజుపేట స్టేషన్లు ప్రతిపాదించారు. అయితే రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టగా.. ప్రతిపాదిత మార్గంలో అధిక భాగం పోలవరం జలాశయం ముంపు పరిధిలో ఉన్నట్లు వెల్లడైంది. ఈ విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మొత్తం 65 కిలోమీటర్లలో అత్యధిక భాగం ముంపు ప్రాంతంలోకి వస్తున్నట్లు స్పష్టమైంది.ఈ సమస్యపై రైల్వే అధికారులు పలుమార్లు పోలవరం జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపారు. అయితే ఇప్పటికే ప్రతిపాదించిన మార్గాన్ని యథాతథంగా కొనసాగించడం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రత్యామ్నాయ మార్గంపై దృష్టి సారించారు. పోలవరం జలాశయం ముంపునకు గురయ్యే గ్రామాల పరిధిని పరిగణనలోకి తీసుకుంటూ.. వాటికి ఎగువన ఏ ప్రాంతం నుంచి రైల్వే లైన్ నిర్మించవచ్చనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇందుకోసం కొత్తగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే దాదాపు తుది దశకు చేరుకోవడంతో త్వరలోనే నివేదికను రైల్వే బోర్డుకు సమర్పించనున్నారు. మల్కన్‌గిరి-భద్రాచలం-పాండురంగాపురం రైల్వే లైన్ నిర్మాణానికి తొలుత రూ. 2,864 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. అయితే పోలవరం జిల్లా పరిధిలో ఎలైన్‌మెంట్ మార్పు అనివార్యం కావడంతో ప్రాజెక్టు వ్యయంలోనూ మార్పులు వచ్చే అవకాశం ఉంది. గతంలో ప్రతిపాదించిన స్టేషన్ల స్థానంలో కొత్త ప్రాంతాల్లో స్టేషన్లు నిర్మించాల్సి రావచ్చు. ప్రత్యామ్నాయ మార్గంలో కొన్ని చోట్ల సొరంగాలు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. వీటికి అదనపు నిధులు అవసరమవుతాయి. మరోవైపు ఈ రైల్వే లైన్ నిర్మాణానికి పెద్దఎత్తున అటవీ భూములు అవసరం కానున్నాయి. దీంతో అటవీ అనుమతులు, భూసేకరణ, కొత్త ఎలైన్‌మెంట్ ఖరారు వంటి అంశాలు ప్రాజెక్టు పురోగతిలో కీలకంగా మారనున్నాయి.

ఇంటర్మీడియట్ విలీనం: వ్యవస్థాగత మార్పుల్లో సగటు లెక్చరర్ల మనుగడ ప్రశ్నార్థకం కాకూడదు



హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేస్తూ నూతన 10+2 విద్యా విధానాన్ని ప్రతిపాదించడం విద్యా రంగంలో ఒక కీలకమైన పరిణామం. జాతీయ విద్యా విధానం స్ఫూర్తితో విద్యా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పం స్వాగతించదగినదే అయినప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవాలను, సామాజిక-ఆర్థిక పరిణామాలను పరిగణనలోకి తీసుకోకుండా ఈ విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం వల్ల తీవ్రమైన సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా, దశాబ్దాలుగా విద్యా రంగానికి వెన్నెముకగా నిలిచిన చిన్న తరహా జూనియర్ కళాశాలల మనుగడ, వాటిపై ఆధారపడి బతుకుతున్న వేలాది మంది ప్రైవేట్ లెక్చరర్ల భవిష్యత్తు నేడు తీవ్ర సందిగ్ధంలో పడ్డాయి.

కార్పొరేట్ గుత్తాధిపత్యానికి మార్గం సుగమమేనా?

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ దిక్కుగా నిలిచాయి. తాజా ప్రతిపాదనల ప్రకారం, 11, 12 తరగతులను సీనియర్ సెకండరీ స్కూల్స్‌గా మార్చాలంటే 9వ తరగతి లేదా ప్రాథమిక స్థాయి నుండి పాఠశాల

పుస్తకావిష్కరణకు రాజకీయ దిగ్గజాలు.. వారం రోజుల్లోనే 2 లక్షల కాపీలు!



న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రచించిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకానికి పాఠకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. విడుదలైన కొద్ది రోజులకే ఈ పుస్తకం రెండు లక్షల కాపీలు అమ్ముడైనట్లు ప్రచురణ సంస్థ హార్పర్‌కాలిన్స్ ప్రకటించింది. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సమక్షంలో సోనియా గాంధీ ఈ పుస్తకాన్ని అధికారికంగా ఆవిష్కరించారు.ఈ పుస్తకంలో సోనియా గాంధీ తన రాజకీయ ప్రయాణంలోని కీలక ఘట్టాలను ప్రస్తావించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి పదవిని చేపట్టే అంశంపై అప్పట్లో చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. తొలుత ఆ పదవిని చేపట్టాలనే ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకించినట్లు తెలిపారు. అయితే కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు పదవిని స్వీకరించాలని పదేపదే కోరడంతో కొంత మెత్తబడి 'ఠీక్ హై' (సరే) అన్నట్లు పేర్కొన్నారు. చివరకు మాత్రం ప్రధానమంత్రి పదవిని తీసుకోకూడదని స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు తన ఆత్మకథలో వివరించారు.సోనియా గాంధీ పుస్తకావిష్కరణ కార్యక్రమం రాజకీయ ప్రముఖుల సమక్షంలో జరిగింది. తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీనియర్ నాయకులు అఖిలేశ్ యాదవ్, సుప్రియా సూలే కూడా హాజరయ్యారు.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ భార్య గురుశరణ్ కౌర్, బీజేపీ నేత అమరీందర్ సింగ్, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ బెనర్జీ, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, పీడీపీ నాయకురాలు మెహబూబా ముఫ్తీ తదితరులు ఈ కార్యక్రమానికి వచ్చారు.

ఆపరేషన్ కగార్‌పై అమిత్ షా కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, నక్సలిజం నిర్మూలన గొప్ప విజయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని అమిత్ షా ప్రశంసించారు. గతంలో ఎదురైన ఆర్థిక ఇబ్బందులను అధిగమించి, రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి బాటలో నడిపించడంలో ప్రభుత్వం సఫలమైందని ఆయన అభిప్రాయపడ్డారు. రాబోయే పదేళ్ల కాలంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా అవతరిస్తుందని అమిత్ షా ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర పారిశ్రామిక వృద్ధిపై..

విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు కావడం కేవలం రాష్ట్రానికే కాకుండా యావత్ దేశానికే గర్వకారణమని అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో భారీ స్థాయిలో స్టీల్ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, ఇది పారిశ్రామిక రంగానికి కొత్త ఊపునిస్తుందని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల గత రెండున్నరేళ్ల కాలంలో రాష్ట్రానికి రూ. 30 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు తరలివచ్చాయని, తద్వారా ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అమిత్ షా వివరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి కావడం ద్వారా అన్నదాతలు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సాగుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర భవిష్యత్తును సమూలంగా మార్చబోతున్నాయని అమిత్ షా పేర్కొన్నారు.

శబరిమలై భక్తులకు ప్రత్యేక రైళ్లు..చర్లపల్లి-కొల్లం మధ్య ఐదు సర్వీసులు



శబరిమలై అయ్యప్ప స్వామి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. చర్లపల్లి-కొల్లం మధ్య ఐదు ట్రిప్పుల చొప్పున ఈ రైళ్లను నడపనుంది. డిసెంబర్ 15 నుంచి జనవరి 12 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 7.15 గంటలకు కొల్లం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో డిసెంబర్ 17 నుంచి జనవరి 14 వరకు ప్రతి గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు కొల్లంలో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 1 గంటకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లు కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు, ధర్మవరం, బెంగళూరు మార్గంలోని పలు స్టేషన్ల మీదుగా నడుస్తాయి.మరో మూడు ప్రత్యేక రైళ్లు ప్రయాణికుల రద్దీ నివారణకు నాందేడ్‌పాట్నా ప్రత్యేక రైలును ఈ నెల 18న, చర్లపల్లిదానాపూర్ రైలును ఈ నెల 19న, దానాపూర్‌చర్లపల్లి రైలును ఈ నెల 21న నడపనున్నారు. ప్రత్యేక రైళ్ల పొడిగింపు చర్లపల్లిబక్సర్, బక్సర్‌చర్లపల్లి, చర్లపల్లిబరౌనీ, బరౌనీచర్లపల్లి ప్రత్యేక రైళ్లను ఒక్కో ట్రిప్పు చొప్పున పొడిగించారు.

మరణ శిక్ష రద్దుకు భారత్ వ్యతిరేకం...రీజన్ ఇదే !



న్యూఢిల్లీ,భారత దేశంలో మరణ శిక్ష అన్నది అత్యంత కఠినమైన శిక్షగా ఉంటుంది. అంతే కాదు అదే అంతిమ శిక్ష కూడా అవుతుంది. అయితే భారత్ లో మరణ శిక్ష 1860 నుంచి అమలు చేస్తున్నారు . దేశంలో ఆధునిక న్యాయ వ్యవస్థ ప్రకారం మరణ శిక్ష బ్రిటిష్ వారు రూపొందించిన భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 53 సెక్షన్ 302 ప్రకారం హత్య రాజద్రోహం వంటి తీవ్రమైన నేరాలకు మరణశిక్షను చట్టబద్ధం చేశారు. అయితే పురాతన కాలం నుంచే భారత్ లో రాజుల పాలనలో మరణ శిక్ష అమలులో ఉంది. దేశానికి స్వాతంత్రం తర్వాత కొనసాగిస్తూ వస్తున్నారు

అదే మొదటి ఉరి :

ఇక స్వతంత్ర భారతదేశంలో మొదటి ఉరిశిక్ష 1947 సెప్టెంబర్ 9న జబల్‌పూర్ జైలులో రఘురాజ్ సింగ్ అనే వ్యక్తికి అమలు చేశారు. అలాగే 1949 నవంబర్ 15న మహాత్మా గాంధీ హత్య కేసులో నాథూరాం గాడ్సే నారాయణ్ ఆప్టేలను ఉరితీశారు. ఆ తరువాత 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టికల్ 21 ప్రకారం మరణశిక్షను కొనసాగించారు. 1980లో సుప్రీంకోర్టు బచన్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో తీర్పునిస్తూ, కేవలం అరుదులో అరుదైన కేసులలో మాత్రమే మరణశిక్ష విధించాలని స్పష్టం చేసింది. మోడీ ప్రభుత్వ హయాంలో పాత ఐపీఎస్ స్థానంలో తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత- 2023 భారతీయ నాగరిక్ సురక్షా సంహిత - 2023 చట్టాలలో కూడా మరణశిక్షను కొనసాగించారు. దీని ప్రకారం అత్యంత తీవ్రమైన నేరాలకు ఉరితీత ద్వారా మరణశిక్ష అమలు చేస్తారు.

వ్యతిరేకంగా ఓటు :

ఇదిలా ఉంటే మరణ శిక్షల మీద ప్రపంచవ్యాప్తంగా తాత్కాలికంగా నిషేధానికి ఐక్యరాజ్య సమితి ముసాయిదా తీర్మానం తాజాగా ప్రవేశపెట్టింది. అయితే ఈ తీర్మానానికి భారత్ వ్యతిరేకంగా ఓటు వేయడం విశేషం. అలాగే భారత్ తో పాటు అమెరికా చైనాతో సహా 33 దేశాలు మరణ శిక్షను రద్దు చేయమని స్పష్టం చేశాయి. మెక్సికో ప్రతిపాదించిన ఈ తీర్మానానికి అనుకూలంగా 133 దేశాలు ఓటు వేస్తే మరో 16 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఇక మరణ శిక్ష అమలు అంశంపై ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ఏకాభిప్రాయం లేదని ఈ సందర్భంగా భారత్ స్పష్టం చేసింది.

అరుదులో అరుదైన కేసుల్లోనే :

భారత్ లో మరణ శిక్షల అమలు గురించి చట్టంలో ఉన్న అమలులో మాత్రం చాలా ప్రమాణాలు పాటిస్తోంది. అరుదులో అరుదైన కేసులలో మాత్రమే ఈ కఠినమైన శిక్షను అమలు చేస్తోంది. ఇదే విషయాన్ని ఐక్యరాజ్య సమితిలో భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ భవిక మంగళానందన్ స్పష్టం చేశారు. భారత్ లో సక్రమమైన న్యాయ వ్యవస్థతో పాటు ఎన్నో రక్షణ చర్యలు ఉన్నాయని ఆ దశలు అన్నీ దాటిన మీదటనే మరణ శిక్ష విధింపు అన్నది వస్తుందని ఆమె పేర్కొన్నారు.

భారత్ లో పెండింగులో కేసులు :

భారతదేశంలో పెండింగులో ఉన్న మరణ శిక్షల వివరాలు చూస్తే ప్రస్తుతం సుమారు 545 నుండి 564 మంది వరకు ఖైదీలు మరణశిక్ష పడి జైళ్లలో ఉన్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి. మరణశిక్ష పడిన ఖైదీలు అత్యధికంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నారు. అలాగే భారతదేశంలో చివరిసారిగా 2020 మార్చి 20న ఢిల్లీలోని తీహార్ జైలులో 2012 సామూహిక అత్యాచారం హత్య కేసులో నలుగురు దోషులకు ఉరిశిక్ష అమలు చేశారు. అంతకుముందు 2015 జూలై 30న ముంబై పేలుళ్ల దోషి యాకూబ్ మెమన్‌కు ఉరిశిక్ష విధించారు. మరణశిక్షను అమలు చేయడానికి ఉరితీయడం చట్టబద్ధమైన సరైన పద్ధతి అని పేర్కొంటూ ఇక రాజ్యాంగంలోని 72వ అధికరణం ప్రకారం రాష్ట్రపతికి 161 అధికరణం ప్రకారం గవర్నర్‌కు మరణశిక్షను మార్చడానికి లేదా క్షమాభిక్ష ప్రసాదించడానికి అధికారాలు ఉంటాయి.

చైనా నంబర్ వన్ :

ఇదిలా ఉంటే ప్రపంచంలో అత్యధికంగా మరణశిక్షలు అమలు చేసే దేశాలలో చైనా మొదటి స్థానంలో ఉంది అని చెబుతారు. కానీ అక్కడి ప్రభుత్వం ఈ గణాంకాలను దేశ రహస్యంగా ఉంచుతుంది. అక్కడ హత్యలు చేసిన డ్రగ్స్ అక్రమ రవాణాతో పాటు తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడినా అవినీతి కేసులలో కూడా చైనా ప్రభుత్వం ఏకంగా మరణ శిక్ష విధిస్తుంది. ఇక చైనాలో ప్రధానంగా విషపూరిత ఇంజెక్షన్ లేదా కాల్చి చంపే పద్ధతుల ద్వారా ఈ శిక్షను అమలు చేస్తారు. అదే సమయంలో కొన్ని కేసులలో మాత్రం దోషి రెండేళ్ల పాటు జైలులో సత్ప్రవర్తనతో ఉంటే మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చే ప్రత్యేక నిబంధన చైనా చట్టాలలో ఉంది.

పాకిస్థాన్‌లో మరణశిక్ష విధానం :

ఇక పొరుగున ఉన్న పాకిస్థాన్ లో ఆ దేశ పీనల్ కోడ్ ప్రకారం హత్యలు, ఉగ్రవాదం, దైవదూషణ, సామూహిక అత్యాచారం వంటి తీవ్రమైన నేరాలకు మరణ శిక్ష విధిస్తారు. పాకిస్థాన్‌లో మరణశిక్షను కేవలం ఉరితీత ద్వారా మాత్రమే అమలు చేస్తారు. ప్రస్తుతం పాకిస్తాన్ జైళ్లలో వేలాది మంది ఖైదీలు మరణ శిక్ష ఖరారై తుది తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవలి కాలంలో కొన్ని నేరాలకు మరణశిక్షను తగ్గించే అంశంపై ఆ దేశ పార్లమెంటులో చర్చలు కూడా జరుగుతూండడం విశేషం.

ఈ సారి కాంగ్రెస్ ను ఓడించగలిగేది అదేనా?



హైదరాబాద్,2028లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ సారి గెలుపు తమదంటే తమదని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాతో పాటు పలు కారణల వల్ల రేవంత్ సర్కార్ పై ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని విమర్శలు వస్తున్నాయి. ఆ వ్యతిరేకతను క్యాష్ చేసుకోవడంతోపాటు మరోసారి కేసీఆర్ మ్యాజిక్ రిపీట్ అవుతుందని, గులాబీ జెండా రెపరెపలాడుతుందని బీఆర్ఎస్ నేతలు కాన్ఫిడెంట్ గా ఉన్నారు. అయితే, 2028 ఎన్నికలలో కాంగ్రెస్ ను ఓడించగలిగేది ..ప్రతిపక్షాలు కాదు..ప్రకృతి విపత్తు. అవును, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించేది ఎల్ నినో ఎఫెక్ట్ అనడం ఏ మాత్రం తొందరపాటు కాదు. ఇక, సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్తును 2027 సమ్మర్ డిసైడ్ చేస్తుంది అనడంలో ఏ మాత్రం సందేహం లేదు.తెలంగాణలో ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల ఎఫెక్ట్ వచ్చే ఏడాది కాదు..ఆల్రెడీ కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది. సాగునీరివ్వలేమని, తాగునీరు మాత్రమే ఇవ్వగలమని, హైదరాబాద్ వాసులు ప్రతి ఒక్కరు కనీసం 20 శాతం నీటి వాడకం తగ్గించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆల్రెడీ రిక్వెస్ట్ కమ్ డిమాండ్ చేశారు. ఎల్ నినో వల్ల ఎఫెక్ట్ తో తెలంగాణలో మొత్తం 21,500 చెరువులలో 6,123 చెరువులు పూర్తిగా ఎండిపోవడమే అందుకు కారణం. మరో 7,141 చెరువుల్లో పావు వంతు కంటే తక్కువ నీరు మాత్రమే ఉండడం, 75 శాతానికి పైగా నిండిన చెరువులు కేవలం 550 మాత్రమే ఉండడంతో అధికారులు కూడా చేతులెత్తేశారు.ఇక, రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గుతుండడంతో తెలంగాణలో రైతులు ఆరుతడి పంటలు, కూరగాయలు మాత్రమే సాగు చేయాలని రేవంత్ కోరారు. రైతులు నీటి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు.రిజర్వాయర్లలో 462 టీఎంసీలకు బదులు 200 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండడం రేవంత్ ను కలవరపెడుతోంది. ప్రధాన రిజర్వాయర్లు మంజీరా, సింగూరు, కృష్ణా బేసిన్ లో నీటి నిల్వలు తగ్గడంతో హైదరాబాద్ మరియు జిల్లా కేంద్రాల్లో ట్యాంకర్ల ద్వారా ఆల్రెడీ నీటిని సరఫరా చేస్తున్నారు ఎల్ నినో చాలా దేశాల్లో ఉందని, ప్రకృతి విపత్తులను ఆపలేమని రేవంత్ చెప్పిన విషయం కరెక్టే. కానీ, తెలంగాణ ఓటర్లు రాబోయే ఎన్నికల్లో ఆ విషయాన్ని అర్థం చేసుకునే పరిస్థితులు ఉండకపోవచ్చు. ఎందుకంటే, వాస్తవాలు ప్రజలకు వివరించడంలో రేవంత్ ప్రభుత్వం ఫెయిల్ అయింది అనేలా కాంగటటగ్రస్ మంత్రుల స్టేట్‌మెంట్లు ఉన్నాయి. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నారు. వచ్చే వానాకాలం వరకు ప్రజల అవసరాలకు సరిపడా రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఉన్నాయని బల్లగుద్ది చెబుతున్నారు. మిషన్ భగీరథకు కావాల్సిన నీళ్లను రిజర్వాయర్లలో నిల్వ చేశామని ఉత్తమ్ చెప్పారు. కానీ, రేవంత్ మాత్రం నీటి వాడకం తగ్గించుకోవాలని, కరువు రాబోతోందని వార్నింగ్ ఇచ్చారు.దీంతో, కాంగ్రెస్ నేతల పరస్పర విరుద్ధ స్టేట్‌మెంట్లకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. హైదరాబాద్‌లో తాగునీటి సమస్య లేదనడం ఇటీవల విన్న జోకుల్లో బెస్ట్ అంటూ కేటీఆర్ సెటైర్లు వేశారు. కాంగ్రెస్ జోకర్లను ఎన్నుకుంటే ఇలాంటి సర్కస్ చూడాల్సి వస్తుందని కేటీఆర్ చురకలంటించారు.

ప్రజలు కోరుకున్నారని రిజర్వేషన్లు ఇవ్వరు!



న్యూఢిల్లీ,ప్రజలు కోరుకుంటున్నారన్న కారణంగా ఒక ప్రాంతాన్ని ఒక వర్గానికి రిజర్వ్ చేయడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. స్థానిక సంస్థల ఎన్నిక అయినా.. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలైనా ప్రజల డిమాండ్లను చూపించి ఆయా ప్రాంతాలను రిజర్వేషన్ కేటగిరీలోకి తీసుకురాలేరని స్పష్టం చేసింది. ఒక ప్రాంతంలో ఏ వర్గం ప్రజలు ఎక్కువగా ఉన్నారు? వారికి సంబంధించిన సమస్యలు పరిష్కారం అవుతున్నాయా? లేదా? ఆ వర్గానికి పాలన, అధికారం పరంగా ఎన్నికల ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ఉందా? లేదా? అనే నిర్ణయం ప్రజల చేతుల్లో లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈక్రమంలో ఒక ప్రాంతాన్ని తమకు రిజర్వ్ చేయాలని కోరే అవకాశం, హక్కులు లేవంది.

విషయం ఏంటి?

మహారాష్ట్రలో గత ఏడాది జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో గడ్చిరౌలి జిల్లాలో ఒక ప్రాంతాన్ని తమ వర్గానికి రిజర్వ్ చేయాలని ఎస్టీలు కోరారు. అయితే.. అది ఎస్సీలకు కేటాయించారని.. కాబట్టి అలా చేయడం కుదరని ఎస్సీలు పట్టుబట్టారు.అయితే.. స్థానిక ఎన్నికల సమయంలో రొటేషన్ ప్రాతిపదికన ప్రతి ఐదేళ్లకు ఒకసారి రిజర్వేషన్ మార్చుకునే అవకాశం ఉందని ఎస్టీలు కోరారు. ఈ వ్యవహారం ఎటూ తేలకపోవడంతో ఇక్కడ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ వ్యవహారం చివరకు బాంబే హైకోర్టుకు చేరింది. దీనిని విచారించిన కోర్టు.. రొటేషన్ ప్రాతిపదికన ప్రభుత్వం తీసుకునే నిర్ణయమే అంతిమమని తీర్పు చెప్పింది.ఈ వ్యవహారం చివరకు సుప్రీంకోర్టుకు చేరింది. దీనిపై సమగ్ర విచారణ చేసిన సుప్రీంకోర్టు.. ఒక ప్రాంతానికి తమ వర్గానికి రిజర్వ్ చేయాలని కోరే హక్కు ప్రజలకు లేదని పేర్కొంది. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులు.. ఏ వర్గానికి అన్యాయం జరిగిందో తెలుసుకుని.. ఆ వర్గ ప్రజల సంఖ్యను, వారి అభిప్రాయాలను కూడా చూసుకుని ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయానికి ప్రజలుకట్టుబడాలని స్పష్టం చేసింది. "తమ నియోజకవర్గం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ కావాలనే హక్కు ఎవరికీ లేదు. రిజర్వేషన్ల రొటేషన్ విధానం పూర్తిగా ప్రభుత్వ విచక్షణాధికారమే." అని పేర్కొన్న సుప్రీంకోర్టు బాంబే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ కొట్టివేసింది.

రిజర్వేషన్‌పై..

సాధారణ రిజర్వేషన్లకు.. ఎన్నికల రిజర్వేషన్‌కు తేడా ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సమాజంలో వెనుకబడిన వర్గాలకు కొంత ఊతం ఇచ్చేందుకు మాత్రమే రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని.. ఇది హక్కుగా దఖలు పడదని పేర్కొంది. ఇప్పటి వరకు రిజర్వేషన్ పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు కూడా.. సమాజంలో ఉన్నత స్థితికి చేరుకున్నాయని ప్రభుత్వం భావిస్తే.. వారికంటే వెనుక బడిన వర్గాలకు రిజర్వేషన్ వర్తింప చేయొచ్చని గతంలో ఇచ్చిన తీర్పును ఉటంకించింది. ఇక, ఎన్నికల విషయంలో రిజర్వేషన్ అనేది ప్రభుత్వ సంపూర్ణ హక్కుగా ఉంటుందని పేర్కొంది.

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేట,ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహణ పనులను: జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఈ నెల 19 న ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభ ప్రాంగణం మొత్తం ట్రాక్టర్, డోజర్లతో లెవెలింగ్ పనులు దాదాపు పూర్తి, గ్రౌండ్ మొత్తం పలు మార్లు వాటరింగ్ చెయ్యాలని అధికారులను ఆదేశించారు. గ్రౌండ్ చుట్టూ బారి కెడింగ్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని, వాటరింగ్ పూర్తి కాగానే స్టేజి పనులు మొదలు పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఢిల్లీ...తల్లఢిల్లీ..గాలి పీలిస్తే వామ్మో !



న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యతా ప్రమాణాలు దారుణంగా పడిపోతున్నాయి. శీతాకాలం వస్తే చాలు ఢిల్లీలో ఎపుడూ ఇదే రకమైన పరిస్థితి ఉంటుంది అన్నది తెలిసిందే. నవంబర్ నెలలో అది మరింతగా ఎక్కువ అయింది అంటున్నారు. ప్రస్తుతం చూస్తే ఢిల్లీలో వాయు కాలుష్యం అత్యంత భయంకరంగా ఉంది అని అంటున్నారు. తాజాగా ఉన్న గణాంకాలని చూస్తే ఢిల్లీలో ఏవరేజ్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 350 నుండి 365 మధ్య నమోదైంది. ఇక ఐఐటీ ఢిల్లీ వద్ద 428 గా ఉంటే అనేకమైన ప్రదేశాలలో ఏకంగా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400 మార్కును దాటి పోయింది. దీంతో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అవుతోంది.

జబ్బు పడతారు అంతే :

ఢిల్లీలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో గాలి పూర్తిగా కాలుష్య పూరితం అయిందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల ఢిల్లీకి ఈ సీజన్ లో పెద్ద ఎత్తున వచ్చే పర్యాటకులు కానీ అలాగే దేశ రాజధాని కాబట్టి అనేక రకాలైన పనులు కోసం వచ్చే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. లేకపోతే మాత్రం జబ్బుల బారిన పడడం ఖాయమని కూడా హెచ్చరిస్తున్నారు. ఇక ఈ ఆదివార అయితే ఢిల్లీలో గాలి నాణ్యత అత్యంత పేలవంగా ఉందని అంటున్నారు. దీంతో స్థానిక ప్రజలు ఎవరూ రోడ్ల మీదకు వచ్చేందుకుకూడా సాహసించడం లేదని అంటున్నారు.

వెరీ బ్యాడ్ :

ఢిల్లీ గాలిలో నాణ్యత బాగా పడిపోయింది అని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి స్పష్టం చేసింది. ఢిల్లీలో వివిధ ప్రాంతాలలో గాలి నాణ్యత వెరీ పూర్ గా ఉందని ఇక మరి కొన్ని ఒచోట్ల తీవ్రమైన పరిస్థితుల్లో ఉందని కూడా పేర్కొంది. ఢిల్లీ రెండు రోజుల క్రితం పేలవమైన గాలి నాణ్యతతో ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది. నవంబర్ 13న సగటు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 403కు చేరడంతో అంతర్జాతీయంగా అత్యంత కాలుష్య నగరాల లిస్ట్ లోకి వెళ్ళిపోయింది. దానికి కారణం ఈ నెల 8న జరిగిన దీపావళి పండుగ సందర్భంగా బాణా సంచాతో వచ్చిన కాలుష్యం అని అంటున్నారు. అదే సమయంలో ఉష్ణోగ్రతలు సహజంగా శీతాకాలంలో పడిపోతాయి. ఇలా ఢిల్లీ గాలి భయపెడుతోంది అనీ అంటున్నారు.

పీలిస్తే ముప్పు :

ఢిల్లీలో అధ్వాన్నమైన గాలిని పీలిస్తే కనుక అనారోగ్యం వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గాలిలో సూక్ష్మ ధూళి కణాలు భారీ ఎత్తున పెరుగుతున్నాయని అంటున్నారు. దీంతో కళ్ళలో మంటలు అలాగే గొంతులో సైతం మంటలు అదే పనిగా దగ్గు, ఇక శ్వాస పీల్చుకోవడం కూడా కష్టంగా మారుతోంది అని అంటున్నారు. ఈ నేపథ్యంలో కఠినమైన నియమాలను అమలు చేయాలని ఢిల్లీ ప్రభుత్వం చూస్తోంది. వర్క్ ఫ్రం హోం విధానం తీసుకుని రావాలని చూస్తున్నారు. అదే విధంగా వాహనాలకు కూడా నియంత్రణను పెట్టి కాలుష్య కారకాలను అదుపు చేయాలని చూస్తున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140